

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.

మా మెయిల్ ఐడి :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 1 సంచిక : 138 ఎడిటర్ : నరేష్ సాకే వార సంచిక : ( 19 - 03 - 2023 ) పేజీలు : 6

# జనసేన పార్టీ

## రాష్ట్ర రాజకీయాల్లో బలమైన సంతకం చేస్తుంది

న్యూస్ ( జనస్వరం ) : రాష్ట్ర రాజకీయాల్లో వైసీపీ ఏది జరగకూడదని కోరుకుంటుందో వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా అదే జరుగుతుంది.. మనమంతా ఏది జరిగితే బాగుంటుందని అనుకుంటున్నామో అదే అవుతుంది. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ యవనికపై బలమైన సంతకం కాబోతోంది. వచ్చే ఎన్నికల్లో మా ప్రణాళికలన్నీ అసెంబ్లీలో బలమైన పక్షంగా అడుగు పెట్టేలా ఉంటాయి. నాతో పాటు మా నేతలంతా గెలిచేలా ముందుకు వెళ్తాం తప్ప రాజకీయ ప్రయోగాల జోలికి వెళ్లేది లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయపరంగా ఈసారి జనసేన బలి పశువు కాదు.. కాబోదు అని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఉద్ఘాటించారు. జనసేన పార్టీ పదో ఆవిర్భావ సభ నభూతో అన్న రీతిలో మచిలీపట్నం వేదికగా మంగళవారం సాగింది. లక్షలాదిమంది జనసైనికులు, వీర మహిళల సమక్షంలో జరిగిన ఈ ఆవిర్భావ సభ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. సభలో శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ " రాజకీయాల్లో ఓటమి చెందినా ప్రజలకు అండగా నిలబడ్డాం. మరి ఎన్నికల్లో గెలిస్తే ఇంకెంత చేయగలమో ప్రజలు ఆలోచించాలి. నేను ఏ నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర హితం కోసమే ఉంటుందని నమ్మండి. తెలుగుదేశం పార్టీ అంటే నాకేమీ కొత్తగా ప్రేమ లేదు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులుగా శ్రీ చంద్రబాబు గారు అంటే గౌరవం మాత్రం ఉంది. అదే గౌరవం ఇప్పటి ముఖ్యమంత్రి మీదా ఉంటుంది. నేను ఇప్పటి వరకు టీడీపీ అధినేతతో పొత్తుల గురించి, సీట్లు గురించి చర్చించింది లేదు.

( మిగతా 3 లో )




ఆర్థిక సహాయం అందించిన మధుసూధన్ రెడ్డి 4

గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు చేసిన జనసేన 7

కోవూరు నియోజకవర్గంలో అక్రమ గ్రావెల్ తవ్వకం 7

టీం పిడికిలి ఆధ్వర్యంలో జనసేన పోస్టర్లు ఆవిష్కరణ 8

## టొరంటో, వాంకోవర్ — కెనడా లో జనసేనపార్టీ 10 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**న్యూస్ ( జనస్వరం )** : జనసేనపార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చాలా ఘనంగా టొరంటో, మరియు వాంకోవర్ మహానగరాల్లో కెనడా జనసేన టీం ముందస్తుగా ఈ వారాంతంలో 11th మార్చ్ శనివారం నాడు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కెనడా జనసైనికులు మాట్లాడుతూ 2024 ఏప్రిల్ ఎన్నికలకు ఎలా సంసిద్ధం కావాలి అనే దాని మీద వివరంగా చర్చించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కెనడా జనసేన టీం 14 లక్షల రూపాయలు పైగా విరాళం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలకు అధికారం వైపుగా పవన్ కళ్యాణ్ గారు చేస్తున్న ఈ పోరాటంలో తమ వంతు మద్దతు నిలవడానికి నాలుగు వందల పైచిలుకు కెనడా జనసైనికులు ఒక్కొక్కరు తమ తమ నియోజకవర్గంలోని వందమంది కుటుంబాలను ప్రభావితం చేస్తామని ప్రకటించారు. జనసేన వీర మహిళలు కేక్ కట్ చేసి ఆవిర్భావ సభ వేడుకలకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. క్రియాశీలక సభ్యత్వం యొక్క విశిష్టతను పవన్ కళ్యాణ్ గారి ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీ సభ్యుల భద్రత కొరకు తన సొంత ఖర్చులతో కోటి రూపాయల మ్యాచింగ్ ఫండ్ ఇచ్చారని తెలియజేశారు. పవన్ కళ్యాణ్ గారి వీడియో సందేశాలను ప్రదర్శించి ఆహ్లాదభరిత వాతావరణంలో వేడుకలను నిర్వహించారు. కెనడా జనసేన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "Know Your Leader" ప్రోగ్రాం లో భాగంగా లోకల్ గా ఉన్న జనసేన నాయకులతో ప్రతి వారాంతంలో కెనడా జనసేన టీం చర్చలు జరుపుతూ స్థానిక సమస్యల మీద, అధికార పార్టీ అవినీతి పాలనా వివరాలు తెలుసుకుంటూ వచ్చే ఎలక్షన్స్ లో యుద్ధానికి ఎలా సిద్ధంగా ఉండాలో తెలుసుకుంటున్నారు.

## కాన్బెర్రా "మీట్ అండ్ గ్రీట్"లో నాగబాబు



**న్యూస్ ( జనస్వరం )** ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగు వారు, అన్ని వర్గాల ప్రజలు జనసేన అధికారంలోకి వస్తేనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందనే బలమైన ఆలోచనలో ఉన్నారని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగబాబు గారు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో భాగంగా కాన్బెర్రా నగరంలో గురువారం "మీట్ అండ్ గ్రీట్" అనే పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో నాగబాబు గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి జనసేన పార్టీ పరిపాలనలోనే సాధ్యం అవుతుందనే అభిప్రాయం అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల ప్రజల్లో బలంగా నాటుకుందని పునరుద్ఘాటించారు. ఆస్ట్రేలియాలో స్థిరపడిన జన సైనికులు, వీర మహిళలు సమిష్టిగా వారం రోజుల పాటు సిడ్నీ, మెల్ బోర్న్, పెర్త్, కాన్బెర్రా తదితర ప్రధాన నగరాల్లో నిర్వహించిన సభలు, సమావేశాలు, చర్చావేదికల్లో నాగబాబు గారు ప్రసంగించారు. ఆస్ట్రేలియా నుండి న్యూజిలాండ్ జనసైనికులు, వీర మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జనసేన నాయకులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హైపర్ ఆది, పాటుగా ఆస్ట్రేలియా పర్యటనలో ఆయా వేదికలపై అతిథులుగా హాజరయ్యారు.

# 'మైనార్టీ' వర్గం చుట్టూ.. ఏపీ రాజకీయం చక్కర్లు..!

రాష్ట్ర రాజకీయాల్లో క్రమేపీ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మైనార్టీ జనసముదాయం చుట్టూ ప్రస్తుతం అవి చక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సుదీర్ఘ విరామం తరువాత మైనార్టీ మత పెద్దలతో ఇటీవల జరిపిన ప్రత్యేక భేటీ, సరికొత్త చర్చకు దారితీసింది. జనసేనాని పవన్ కళ్యాణ్ సైతం, తాజాగా మైనార్టీల భద్రతే ప్రధాన అంశంగా కీలక వ్యాఖ్యలు చేయడం రానున్న ఎన్నికల్లో ముస్లిం ఓట్ల ప్రభావాన్ని, ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తుంది. బందరులో జరిగిన ఆ పార్టీ ఆవిర్భావ సభ దిగ్విజయ భేరీలో మైనార్టీల రక్షణ అంశాన్ని కీలకంగా ప్రస్తావించిన పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో మైనార్టీల భద్రత ప్రశ్నార్థకమైతే.. తాను బీజేపీ పొత్తు నుంచి విడాకులు కోరుకుంటానని సూటిగా చెప్పటం, రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంలో ఇకపై మైనార్టీ ఓట్ల ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. ఈ తరహా సమీకరణల నేపథ్యంలో మూడున్నర ఏళ్ల అనంతరం సీఎంతో మైనార్టీ పెద్దల భేటీకి అవకాశం చిక్కింది.

### సీఎం భేటీతో కీలక మలుపులు :

అన్యూహ్యంగా గంటల వ్యవధిలో ఖరారైన సీఎం భేటీ ఆ జనసముదాయం వాస్తవిక స్థితిని తేటతెల్లం చేసింది. అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరి ప్రాయోజిత కార్యక్రమంగా సాగిన ఆ భేటీ అటు పార్టీలోనూ ఇటు ముస్లిం జనసముదాయంలోనూ కొత్త చిచ్చురేపింది. సామాజిక మాధ్యమాల్లో సదరు భేటీ అంశమే కీలకంగా రేయింబవళ్లు పలు వివాదాస్పద అంశాలు చర్చకు వస్తున్నాయి. భేటీలో పాల్గొన్న మత పెద్దలను, ఇతర ముఖ్యులను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా ట్రెండింగ్‌లో ఉంది. పలు సినిమా సీన్లకు.. భేటీ అంశాలను జోడిస్తూ, మైనార్టీ సేవా సంస్థలు, సంఘాల నేతలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. భేటీకి సంబంధించిన కీలక అంశాలు, వాటి పరిష్కారానికి సీఎం స్పందించిన తీరు, ప్రభుత్వ స్పందన తదితర విషయాలన్నీ మాధ్యమాలన్నీ వెనువెంటనే ప్రముఖంగా ప్రచురించాయి. అన్యాకాంతమైన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ ప్రధాన డిమాండ్‌గా ఆ సామాజికవర్గంలో ఇటీవల కొంత కదలిక వచ్చింది. ఆలోచనాపరులు కొందరు తదుపరి కార్యచరణకు కొంత సమాయత్తం చేస్తున్నారు. ఎన్నార్సీ, సీఏఏ పరిణామాలు, కరోనా విపత్తు నేపథ్యంలో సుదీర్ఘకాలంగా స్తబ్దుగా ఉన్న ఆ సామాజిక వర్గం కనువిప్పు దిశగా కదులుతున్న స్థితిలో.. సీఎంతో మతపెద్దల ఆకస్మిక భేటీ, చీలికలు పేలికలతో సతమతమవుతున్న ఆ సామాజంలో మరికొన్ని కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే సేవా కార్యకర్తలు కొందరు సీఎం భేటీపై తమదైన శైలిలో ప్రశ్నాస్త్రాలు సంధిస్తున్నారు.

### వక్ఫ్ స్థితిగతుల వెల్లడిలో వైఫల్యం:

వక్ఫ్ ఆస్తుల వాస్తవ స్థితిగతులతో పాటు, ఏపీ ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎంకు నివేదించడంలో మత పెద్దల వైఫల్యంపై కొందరు దండెత్తుతున్నారు. పెద్దలను బృందంగా సీఎం వద్దకు తోడ్కొని వెళ్లిన వైసీపీ నాయకత్వం సైతం, సీఎంను పలు కీలక అంశాల్లో మెప్పించలేకపోయిందని మండిపడుతున్నారు. సీఎం ఎదుట ప్రతినిధి బృందాన్ని హాజరుపర్చి కీలక పదవిని పొడిగించుకునే ప్రాయస తప్ప, ఏపీ మైనార్టీలకు ప్రత్యేకించి ఒరిగింది లేదని దుయ్యబడుతున్నారు. సీఎం భేటీని సమన్వయపర్చిన వ్యక్తి, పదవీ అర్హతలను కోర్టులో ప్రశ్నించిన వారికే పెద్దపీట వేయ దంలోని మతలబులు వెతుకుతున్నారు. అందుకు సంబంధించిన గత మీడియా సమావేశాలు, తాజాగా సీఎంతో భేటీ క్లిప్పింగులను జత చేసిన వీడియోలు, సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నాయి. ప్రస్తుత సమన్వయ కర్తపై అప్పటి ఆగ్రహావేశాలు, తాజా సన్మాన సత్కారాల ఫొటోలను జోడించి మొత్తంగా కుదిరిన డీల్‌గా కొందరు పదే పదే ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

### వందేళ్ల జమాతులకు అందని ఆహ్వానం :

గత వందేళ్లుగా ముస్లిం మైనార్టీ జనసముదాయంలో ప్రభావ వంతమైన పాత్ర పోషించే జమాతే ఇస్లామీ, జామాఅతే ఉలేమా ధార్మిక సంస్థల ప్రతినిధులకు సీఎం భేటీలో చోటు లేకపోవడాన్ని నిలదీస్తున్న పలు పోస్టులు ముస్లిం గ్రూపుల్లో వైరల్ అవుతున్నాయి. రాష్ట్రంలో సంఖ్యాపరంగానే కాక, ఓటింగ్ పరంగానూ నియోజకవర్గాల వారిగా తమదైన ప్రభావం చూపే ఇరు సంస్థల నాయకత్వం, సీఎంతో తొలి భేటీలోనే తమకు ఆహ్వానం లేకపోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నాయి. దానికి తోడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం, మైనార్టీలకు అధికార పదవులకు సముచిత స్థానం దక్కగా,సీఎంతో జరిగిన తొలిభేటీలో ఆ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ స్థాయి వ్యక్తులు లేకపోవాడాన్ని పార్టీ శ్రేణులకు సైతం మిందుగు పడటం లేదు. ఆహ్వానం లేక పోవడంపై సన్నిహితుల వద్ద గుంభనంగా వాపోతూనే కిమ్మనలేక పోతున్నారు. వైసీపీకి దీర్ఘకాలంగా స్వచ్ఛంద సేవలందిస్తున్న వారు సైతం, పిలుపులేక పోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం భేటీ గంటల వ్యవధిలో ఏర్పాటైనా.. అత్యంత రహస్యంగా ప్రతినిధుల ఎంపిక చేయడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలు :

వీటన్నింటిపై విజయవాడ కేంద్రంగా ఉంటూ ముస్లిం సమస్యలపై తరుచూ గళమెత్తే ఓ సామాజిక వేత్త తనదైన శైలిలో సీఎం భేటీపై సోషల్ మీడియా వేదికగా బాణాలు సంధిస్తున్నారు. సీఎం భేటీని ముందుగానే పసిగట్టి, స్వాగతించిన ఆయన,15 పాయింట్స్ ఫార్ములాతో ముస్లిం పెద్దలకు ముందస్తుగా లీడ్ ఇచ్చారు. వాటిలో వక్ఫ్ తదితర అంశాల ప్రస్తావన ఉన్నప్పటికీ ప్రత్యేకించి రాష్ట్రంలోని వివిధ చోట్ల హత్యాచారాలకు గుర్తై మరణించిన ఆడబిడ్డల కుటుంబాలకు న్యాయం జరిగేలా సీఎంను కోరాలని సూచించారు. ముస్లిం పెద్దలనుంచి సీఎం వద్ద ఆ ప్రస్తావన లేకపోవడంతో, ఆ అంశం ఆధారంగానే నిలదీతకు గురవుతారని ఆయన విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో గుబులు పుట్టిస్తుంది. అన్నీ మత సంస్థల ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ముస్లిం వక్ఫ్ ఆస్తులను చూడటంపై కూడా అంభతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు అవునన్నా కాదన్నా వక్ఫ్ సమస్య అన్నింటా ప్రత్యేకమైంది. అల్లా యజమానిగా ఉన్న ఆస్తులు ఏళ్లుగా అన్యుల చేతిలో బందీఖానాలో మగ్గుతున్నాయి.

### ఇంటి దొంగల అంతు తేల్చాలి :

వక్ఫ్ ఇంటి దొంగల సహకారంతో వేల ఎకరాలు బడాబాబులు గుప్పిట పెట్టుకొని ఏళ్లుగా కోట్లు గడిస్తున్నారు. వక్ఫ్ పర్యవేక్షకులతో సహా బోర్డుకు సముచిత చెల్లింపులు జరగడం లేదు. తృణమో, పణమో పుచ్చుకొని అప్పనంగా లీజు రూపేణా కట్టబెట్టిన వందల కోట్ల ఆస్తులు కబ్జాదారుల హక్కు భుక్తంలోనే నేటికి మగ్గుతున్నాయి. నిర్దేశిత లీజు గడువు ముగిసినప్పటికీ వాటిపై అప్పులు తీరక పోవడంతో కబ్జాదారులకు వరమైంది. కోట్ల ఆస్తులకు పర్యవేక్షకులు అయినప్పటికీ వాటి సాకుగా తీసుకున్న అప్పులు చెల్లించలేని దుస్థితి వారిది.అంగట్లో అన్నీ.. ఉన్నా.. ఎక్కడో శని ఉన్నట్లు.. ఏమీ చేయలేని నిస్సహాయత వారిది. ఇదే అంశాన్ని ముస్లిం పెద్దలు భేటీలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ చుట్టు పక్కల్లో కబ్జాల్లో ఉన్న వందల ఎకరాల వివరాలు సీఎం ఎదుట ప్రస్తావించారు. వక్ఫ్ ఆస్తుల్లో కనీసంగా ఏటా రమజాన్, బక్రీదు పండుగల నమాజులకు కూడా ఆక్రమణదారులు అనుమతించిన దుస్థితిని ఏకరువు పెట్టారు.ఈ అంశాలన్నింటిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అన్నీ మత సంస్థల ఆస్తుల పరిరక్షణకు జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటుకు చర్య తీసుకోవాలని ఆదేశించారు.

### 'వక్ఫ్' కమిషనరేట్, జీఓ.18 ప్రత్యేక డిమాండ్ :

సీఎం స్పందన ఆమోదయోగ్యమే అయినప్పటికీ వక్ఫ్ అంశాన్ని ప్రత్యేకంగా చూడాలని ముస్లిం సంఘాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. వక్ఫ్ పరిరక్షణకు ఐ.ఏ.ఎస్. స్థాయి అధికారి ఆధ్వర్యంలో వక్ఫ్ కమిషనరేట్‌ను కోరుతున్నాయి. ఇంచు మించు ఇదే స్థాయి సారూప్యతతో గత ప్రభుత్వం హయాంలో విడుదలైన జీఓ.18 అమలుకు నోచకపోవడంపై ప్రశ్నిస్తున్నాయి. కలెక్టర్ ప్రధాన బాధ్యులుగా జిల్లా ఎస్.పి.సహా జిల్లా రెవిన్యూ, వక్ఫ్ అధికారులు మెంబర్ కన్వీనర్లుగా సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, పంచాయితీ ఆఫీసర్, ఆర్అండ్‌బీ ఎక్జిక్యూటీవ్ ఇంజనీర్, మైనార్టీ జిల్లా అధికారితో పాటు మరో ముగ్గురు సభ్యులుగా ఏర్పాటైన జిల్లా స్థాయి వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ నిర్వీర్యంపై ప్రశ్నిస్తున్నాయి. ఇన్నేళ్లుగా కాలయాపన జరగడంపై ఆర్టీఏ చట్టం ద్వారా అందిన సమాచారాన్ని ప్రభుత్వ ఉదాసీనతగా ప్రచారం చేస్తున్నాయి.

# ఎడిటోరియల్

### వర్గ కార్పొరేషన్లపై పెదవి విరుపులు :

తాజాగా 'సయ్యద్' కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదనకు పెదవి విరుస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్లలో విభక్త ముస్లిం సమాజాన్ని వేర్పరిచి ఏర్పాటు చేసిన 'షేక్', దూదేకుల, సంచార జాతుల, కార్పొరేషన్ల పని తీరును.. వాటికి నయా పైసా నిధులు కేటాయించక పోవడాన్ని ప్రశ్నిస్తున్నాయి. అంతకు ముందు నుంచే ఉనికిలో ఉన్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ పనితీరు, తద్వారా ఆ జనసముదాయానికి ఇన్నేళ్లుగా జరుగుతున్న లబ్ధిని గురించి ఆరాతీస్తున్నాయి. మైనార్టీ సంక్షేమం సంబంధిత కార్పొరేషన్ ద్వారా 3వేల 5వందల కోట్ల ఖర్చును చూపెడితే, ఆపై 21 వేల కోట్ల నిధుల వెచ్చింపు వివరాలను సందేహిస్తున్నాయి. ముస్లిం మైనార్టీల ప్రగతి వికాసాలకు సంబంధించిన విదేశీ విద్య, దుల్హన్ పథకం, కడప హజ్ హౌస్ నిర్మాణం, ఉర్దూ భాషాభివృద్ధి, ఇమాంలు, మౌజన్ల వేతనాలు, ఖాజీల పదవీ కాలం పెంపు తదితర అంశాలన్నింటిపై సీఎం స్పందన సానుకూలంగానే ఉన్నప్పటికీ, సీఎం భేటీ ద్వారా ముస్లిం సమాజానికి ఆశించిన రీతిలో ప్రయోజనం దక్కలేదని పలు ముస్లిం సంఘాలు పెదవి విరుస్తున్నాయి.

### రహస్యభేటీపై సన్నాయి నొక్కులు :

ఈ భేటీని ఒక వ్యక్తి గత రహస్య ఎజెండా అమలుకు ఉద్దేశించిన భేటీగానే పరిగణించాలని కొందరు వాదిస్తుండగా, మొత్తం ముస్లిం సమాజానికి సీఎంను కల్సిన ప్రతినిధి బృందం ఎలా బాధ్యులవుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసంగా వైసీపీకి మద్దతు దారులుగా కొనసాగుతున్న ఆ సమాజంలోని మేధావులు, ఆలోచనపరులు, తటస్థులకు సైతం అవకాశం దక్కకపోవడంపై సోషల్ మీడియాలో సన్నాయి నొక్కులు వినపడుతున్నాయి. మొత్తం మీద మైనార్టీలతో సీఎం భేటీ ప్రత్యే కమే అయినప్పటికి, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో దానికున్న ప్రాధాన్యతను ముస్లిం సమాజం గుర్తించడం తప్పనిసరి. జనసేన నేత పవన్ కళ్యాణ్ సైతం బిజేపీతో సంబంధాల పునరాలోచనను మైనార్టీలతో జోడిరచారంటే రానున్న ఎన్నికల్లో ముస్లిం ఓట్ల ప్రాధాన్యత తేటతెల్లం అవుతుంది. రాష్ట్ర విభజన తరువాత నాయకత్వం లేమితో కొట్టాడుతున్న ఆ సమాజం నుంచి ప్రభుత్వ ప్రాతినిధ్యం, ప్రాజా ప్రాతినిధ్యం అరకొర మాత్రమే.

### 2024లో ముస్లిం ప్రాతినిధ్యం పెరగాలి :

గుడ్డిలో మెల్లలాగా ప్రాతినిధ్య లోటును వైసీపీ పార్టీ ఎంతో కొంత తీర్చినప్పటికీ, రాష్ట్ర జనాభా దమాషా ప్రకారం ముస్లిం జనసముదాయానికి మరిన్ని సీట్లు దక్కాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో.. ముస్లిం ఓట్లు అత్యంత ప్రభావం చూపే నియోజక వర్గాలు 25కు పైగా ఉన్నాయి. సామాజిక సమీకరణలతో ముస్లిం సముదాయన్ని సరిపోలిస్తే ప్రత్యేకించి ముస్లింలు సునాయాసంగా గెలిచే నియోజకవర్గాలు 12కు పైగా ఉన్నాయి. రాష్ట్ర జనాభాలో 7.8 శాతంపైగా ఉన్న ముస్లిం జనసముదాయం నుంచి ఎమ్మెల్యే సీట్లు మరిన్ని పెరగాల్సి ఉంది. ఏపీ విభజన తరువాత రాష్ట్రం నుంచి పార్లమెంటుకు ముస్లింల ప్రాతినిధ్యం శూన్యం. ప్రజాస్వామ్య వవస్థలో ఏ వర్గమైనా దాని ఓట్లు, సీట్లే కీలకం. సామాజిక ప్రగతి వికాసాలకు, స్వావలంబనకు అధికార పదవులే సోపానం.ముస్లిం సంస్థలు సంఘాలు. ఈ సత్యాన్ని గుర్తెరిగి ప్రాజాస్వామ్య బలోపేతానికి.. తమ సమాజ వికాసానికి కనుగుణంగా కార్యచరణ చేపడితే మరీ మంచిది. ప్రభుత్వంలో సముచిత భాగస్వామ్యం దిశగా అడుగులు కదుపుతూనే, ఆ సమాజ పేదరికం సంపూర్ణ విముక్తికి, వారసత్వంగా వస్తున్న 'వక్ఫ్' వ్యవస్థ పటిష్టానికి, తమ ఉమ్మడి ప్రయత్నాల ద్వారా ఓ ప్రజా ఉద్యమానికి ఊపిరి పోస్తే. అందరి పంతం నెగ్గి.. అందరూ గెలిచినట్లే.. దీనావస్థలో ఉన్న ఆ సమాజం ఎంతో కొంత గట్టెక్కినట్లే...

- జైహింద్



మహ్మద్ షఫీ అహ్మద్,
నవభూమి పత్రిక
సిఈఓ

# కులాల మధ్య చిచ్చుపెట్టే కుతంత్రాలను నిలువరించాలి




న్యూస్ ( జనస్వరం ) : కులాల మధ్య అంతరాలు తగ్గించి... అందరి మధ్య సఖ్యత పెంచేందుకు జనసేన పార్టీ తపిస్తోందని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకు భిన్నంగా అధికార పక్షం కుయుక్తులు పన్నుతోంది. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సమాచారం అందుతోంది. ఈ కుతంత్రాలు తిరుపతి నగరంలో మొదలయ్యాయి. బలిజలు, యాదవుల మధ్య సఖ్యతను విచ్ఛిన్నం చేసేలా కొందరు అధికార పార్టీ వ్యక్తులు చేస్తున్న రెచ్చగొట్టే చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఈ ఉచ్చులో ఎవరూ పడకుండా... ఆ విధమైన కుతంత్రాలకు పాల్పడుతున్నవారిని ఆదిలోనే నిలువరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కులాల మధ్య చిచ్చులు రేపి తమ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. అందులో భాగంగానే బలిజలకీ, యాదవులకీ మధ్య దూరం పెరిగేలా కుట్రలకు తెర తీశారు. ఆ కులాల్లోనూ వర్గాలు ఏర్పాటు చేసి ఐకమత్యాన్ని దెబ్బ తీసి తాము ఆధిపత్యం చలాయించాలని చూస్తున్నారు. ఈ రోజు తిరుపతి కావచ్చు... రేపు మరొక ప్రాంతం కావచ్చు. ప్రజల మధ్య సఖ్యత లేకుండా.. భేదభావాలతో ఉండేలా చేయడమే కుట్రదారుల పన్నాగం. ఈ తరుణంలో అన్ని కులాలవారూ... ముఖ్యంగా యువతరం అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటివారికి ప్రజాస్వామ్య పంథాలోనే సమాధానం ఇవ్వాలి. అందరూ ఒక తాటిపైకి వచ్చి ప్రజల మధ్య దూరం పెంచే కుట్రదారుల చర్యలను నిరసించాలని పవన్ కళ్యాణ్ కోరారు.

## పొట్టి శ్రీరాములు గారికి జయంతి నివాళులు



**మంగళగిరి ( జనస్వరం )** : జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్ మరియు మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు గారి అధ్యక్షతన మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో అమరజీవి " శ్రీ పొట్టి శ్రీరాములు " గారి జయంతి సందర్భంగా ఆయని చిత్రపటానికి పూలమాలవేసి జయంతి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ఈ రోజున అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి 122వ జయంతి సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో మా పార్టీ నాయకులతో కలిసి ఆయనీ చిత్రపటానికి పూలమాల వేసి జనసేన పార్టీ తరపున నివాళులర్పించడం జరిగిందని, తెలుగు ప్రజల కోసం తెలుగు రాష్ట్రాల కోసం పొట్టి శ్రీరాములు గారు చేసిన కృషి మరవలేనిదని, ఆయన త్యాగానికి ప్రతిరూపం మన ఆంధ్ర రాష్ట్రమని, అదేవిధంగా మా పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు జనసేన పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సభ ప్రాంగణానికి అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి పేరు నామకరణం చేయడం జరిగిందని, పొట్టి శ్రీరాములు గారి పోరాట స్ఫూర్తితో మనం కూడా కలిసికట్టుగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీకి అధికారం వచ్చే దిశగా పవన్ కళ్యాణ్ గారు సీఎం అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు.

# మొరిగే కుక్కలకు ప్రజలే బుద్ధి చెబుతారు : డాక్టర్ మైఫోర్స్ మహేష్



**మదనపల్లి ( జనస్వరం )** : జనసేన పార్టీ 10 వ ఆవిర్భావ సభకు వచ్చిన స్పందన చూసి వైసిపి వారికి వణుకు మొదలైందని, మాకు గేటు పాసులు ఇవ్వడం కాదు సిఎం సహా అందరిని ఇంట్లో కుర్చోబెట్టడానికి ప్రజలే మీకు గెటుపాస్ రెడి చేశారని జనసేన పార్టీ దక్షిణ రాయల కోస్తా పార్లమెంటరీ సమన్వయ కర్త డాక్టర్ మైఫోర్స్ మహేష్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ గుడ్డివాడు, క్యారెక్టర్ లెస్, క్యాబరే డ్యాన్స్ వేసుకునే అమరనాథ్, జబర్దస్త్ రోజా, ఆంబోతూ అంబటి, పేర్ని నాని లాంటి కుక్కలు నోరు పారేసు కోవడం మానుకోవాలని హెచ్చరించారు. జనసేన పార్టీ నిర్వహించిన మచిలీపట్నం సభకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావడం శుభపరినామం అన్నారు. సిఎం సభలకు జనాన్ని తోలుకు వచ్చి వారిని కుర్చోబెట్టడానికి వైసిపి నాయకులు నానా తంటలు పడితే జనసేన పార్టీ సభకు వచ్చిన జనం ఎంతో క్రమ శిక్షణగా వున్నారని అన్నారు. సాక్షిలో రాసిన రాతలపై మండిపడ్డారు. అంబులెన్స్ లకు దారి ఇవ్వలేదని, జనం లేరనే తప్పుడు కధలను తప్ప పట్టారు. విజయవాడ ఆటో నగర్ నుండి మచిలీపట్నం వరకు జన నీరాజనాన్ని చూసి ఉలికిపాటుకు గుర్తై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పొత్తుల విషయాన్ని పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు చూసుకుంటారని అంతవరకూ టిడిపి వారు అనవసర, అసత్య ప్రచారాలు మానుకుని పొత్తులకు సహకారించాలని సూచించారు. 20, 30 సీట్లు అంటూ అనవసర ప్రచారం వద్దని హితవు పలికారు. పవన్ కళ్యాణ్ సూచనలతో జనసేన పార్టీ బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు మల్లిక, శోభ తదితరులు పాల్గొన్నారు..

# పన్నులు కట్టే మాకు త్రాగటానికి గుక్కెడు నీరు ఇవ్వలేని వైసీపీ ప్రభుత్వం

**గుంటూరు ( జనస్వరం )** : పాత గుంటూరు చుట్టూ పక్కల ప్రాతంలో త్రాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని వాటర్ సెక్షన్ ఉన్నత అధికారి గారి దృష్టికి జనసేన నాయకులు తీసుకెళ్ళడం జరిగింది. సోషల్ మీడియా ద్వారా కూడా సమస్య గురించి అధికారులను నిద్ర మేల్కొనేలా చేశారు. ఒకానొక సమయంలో వాటర్ డిఈ గారితో జనసేన పార్టీ తరుపున వాదన చేయటం కూడ జరిగింది. సమస్య పరిష్కారించాలని పన్నులు కట్టే ప్రజలకీ త్రాగటానికీ గుక్కెడు మంచి నీరు కూడా ఇవ్వరా ? అంటూ నిలదీశారు. నీరు ఇవ్వనీ పక్షంలో గుంటూరు మున్సిపాలిటీ ముట్టడికీ కూడా జనసేన పార్టీ జెండాతో వెనక్కి తగేదే లేదు అని అధికారులతో మాట్లాడటం జరిగింది. అలాగే ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులతో కూడ మాట్లాడి త్రాగునీటి సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరిగింది. కొత్త వాటర్ పేపు లేను కలెక్షన్ ఏర్పాట్లు చేసి త్రాగు నీటి సమస్య లేకుండా సమస్య పరిష్కరించిన వాటర్ డిఈ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు దార్ల మహేశ్ ముఖ్య పాత్ర వహించారు.

## నారీస్వరం

### ప్రజాస్వామ్యం - యువత - రాజకీయాలు




ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయ పార్టీలు ప్రముఖ పాత్ర పోషిస్తుంటాయి. ఒక్కో రాజకీయ పార్టీకి కొన్ని సిద్ధాంతాలు ఉంటాయి. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధి కొరకు తమ జెండా, అజెండాలతో ఎన్నికల బరిలో నిలబడి గెలిచి రాష్ట్రాభివృద్ధికి రథసారథులుగా ప్రగతి పథంలో నడిపించే వారధులుగా ఉండాలి. కానీ నేటి రాజకీయాల్లో అవే కొదువ. వారసత్వ రాజకీయాలు, ప్రలోభ రాజకీయాలకు ధీటుగా సామాన్యులు రాజకీయాలు చేసేలా కొత్త శకానికి నాంది పలికింది 'జనసేన పార్టీ'. రాజకీయ పార్టీ మనుగడ సాగించాలంటే ప్రజల ఆదరణతో పాటు చిత్త శుద్ధితో పార్టీ అభివృద్ధికి పాటుపడే పార్టీ కార్యకర్తలు ఉండటం ముఖ్యం. జనసేన పార్టీకి ముఖ్య బలం నిస్వార్థ కార్యకర్తలు ఉండటం. సాధారణంగా రాజకీయాల్లో పేరు ప్రఖ్యాతులు, అర్థ బలం, అంగ బలం ఉన్నవాళ్లే అధికం. జనసేన విషయానికి వస్తే పార్టీ అధినేత, సినీ రంగాన పేరున్న కథానాయకుడు అవడం ఇతర ఏ రాజకీయ పార్టీకి లేని అదనపు అర్హత కోట్ల మందికి అభిమాన పాత్రుడు అవడం ఒక విధంగా ప్లస్ ఒక విధంగా మైనస్. చాలా మంది నేటికి రాజకీయాన్ని వేరుగా, అభిమానాన్ని వేరుగా చూడకపోవటం ఒకింత బాధ కలిగించే విషయం. సినిమా రంగానికి చెందిన ప్రముఖ కథానాయకుడిగా ఆయన మీద అపారమైన ప్రేమను చూపించగలిగే అభిమానం పదిలం. కానీ ఆయనకు వ్యవస్థల పట్ల ఉన్న సామాజిక స్పృహ, ఆలోచనలు, ఆశయాలు వీటిని గుర్తించలేని గుడ్డితనం మీద దురభిమానాల పొరలు కమ్ముకొని ఉన్నాయి.

పార్టీ ఆవిర్భావం నుండి ఏ కార్యక్రమం తలపెట్టినా అది జనం కోసం, సమస్యల కోసం పోరాటమే. ఎన్నికల్లో ఓడినా ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ జనం గుండెల్లో స్థానం ఏర్పరుచుకోవటం అంత సులువు కాలేదు. ఒక్కో ఇటుక పేర్చి ఇల్లు కట్టుకున్నట్టు ఒక్కో పోరాటం ఒక్కో సమస్యను జనం దృష్టితో చూసి అదే దృక్పథంతో పోరాడుతుంది అనే నమ్మకం మెల్లిగా సాధించింది. స్థానం లేదు అనుకొనే స్థితి నుంచి స్థిరంగా నిలకడగా జనం గుండెల్లో స్థానం ఏర్పరుచుకుంది. ఉడుకు నెత్తురు పారే యువత ఉక్కు సంకల్పంలా తోడయ్యారు. జనానికి కష్టం వస్తే జనసేన అంటూ సాయం చేశారు. అధినేత నడుస్తున్న దారిని విశాలం చేస్తూ నడక సాగిస్తున్నారు. సమస్యలపై ప్రశ్నిస్తున్నారు పోరాటం చేస్తున్నారు. మార్పు రావాలని అధినేత కోరుకుంటే తొలి అడుగులు వేసి సినిమాలను వినోదంగానే చూస్తూ రాజకీయం చేసే యువ జనసైనికులుగా, వీర మహిళలుగా సమస్యలపై ప్రశ్నిస్తున్నారు పోరాటం చేస్తున్నారు. ఈ తరంలో రాజకీయాధికారం సామాన్యులదే అనే దిశగా ప్రయాణం చేస్తున్నారు. 2018 నాటి ప్రజాపోరాటయాత్ర నుండి నేటి కౌలు రైతు భరోసా యాత్ర వరకూ జనసేన ఎప్పుడూ ప్రజాపక్షమే అని ఋజువు చేస్తున్నది.

లక్ష్యం ఉంటేనే గమ్యం చేరుకోగలం. గమ్యం చేరాలి అంటే చేయి చేయి కలపాలి సంకల్పానికి ఊపిరి పోయాలి. అడుగులన్నీ కలిస్తేనే దూరాన్ని దాటగలం. అభిమానం అడ్డుగోడగా మారి ఆశయాన్ని అడుగు వేయనీయకుండా అడ్డుపడకూడదు. అవరోధాలను దాటుకుంటూ గెలుపు వైపు మన ప్రయాణం సాగాలి.

**- టీమ్ నారీస్వరం**

# ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన చిలకం మధుసూదన్ రెడ్డి



**ధర్మవరం ( జనస్వరం )** : ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం పొట్లమర్రి గ్రామం వద్ద ఆక్సిడెంట్ జరిగింది. వివరాల్లోకి వెళ్తే బత్తలపల్లి నుంచి ధర్మవరంకు ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని వస్తుండగా ధర్మవరం వైపు నుంచి బులోరా వాహనం బత్తలపల్లి వైపు వస్తున్న క్రమంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని నాగుల కట్ట వద్దకు వెళ్ళగానే రెండు వాహనాలు ఢీకొనడం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న పేద కుటుంబాలు ఆరు మంది అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసి చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి చనిపోయిన గొట్లురూకు చెందిన ఈశ్వరయ్య, రాజేంద్రనగర్ కు చెందిన ఫయాజ్, శాంతినగర్ కు చెందిన అస్పిర్, కదిరిగేట్ కు చెందిన నరసింహులు, పోట్లమర్రి కు చెందిన మల్లేష్, నల్లకుంట్ల పల్లికు చెందిన నారాయణస్వామి గార్ల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 10/- వేల రూపాయల చొప్పున మొత్తం 60/- వేల రూపాయలను జనసేన పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అనంతరం మీడియా ముఖంగా మాట్లాడుతూ ఈ సంఘటన ఎంతో దురదృష్టకరమని వారందరూ కూలి చేసుకునే వారు కావడంతో ఈ ప్రభుత్వం పెద్ద మనసు చేసుకొని తక్షణమే 10 లక్షల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేయడం జరిగింది.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్




**ఆళ్లగడ్డ ( జనస్వరం )** : అకాల వర్షాలతో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వెంటనే నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని జనసేన నాయకుడు మైలేరి మల్లయ్య డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వందలాది ఎకరాలలో మొక్కజొన్న, వరి, బొప్పాయి, మామిడి, నిమ్మ, అరటి పంటలు దెబ్బతిన్నాయన్నారు. నష్టాన్ని వ్యవసాయ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే అంచనా వేసి నష్టపోయిన రైతు కుటుంబాలకు ఎకరాకు రూ.20 వేలు చొప్పున నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద యెత్తున ఆందోళనలకు పునుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాచంశెట్టి వెంకటసుబ్బయ్య ,బావికాడి గుర్రప్ప, కుమ్మరి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పిఠాపురం ( జనస్వరం ) : పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం యండపల్లి గ్రామంలో నివాసముంటున్న కొండ చంటిబాబు గారి తాటి ఆకు ఇల్లు గ్యాస్ లీకేజ్ వల్ల అగ్ని ప్రమాదానికి గురైంది విషయం తెలుసుకున్న పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మాకినీడి శేషుకుమారి గారు నాయకులతో కలసి కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి 3000/- ఆర్థిక సహాయం, బియ్యం, అందించడం జరిగింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



# పవన్ కళ్యాణ్ గారికి అండగా నిలబడదాం : చంద్రగిరి ముస్లిం జనసేన నాయకులు

**చంద్రగిరి ( జనస్వరం )** : చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలో జనసేన పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీ పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ముస్లిం మైనారిటీల్లారా పవన్ కళ్యాణ్ గారి కి అండగా నిలబడుదాం, జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్ గారు మనకి అండగా ఉంటారు, ముస్లిం మైనారిటీల అభివృద్ధి బాధ్యతని పవన్ కళ్యాణ్ గారు తీసుకున్నారని జనసేన నాయకులు సోహైల్, రహంతుల్లా, షాజహాన్, రిజ్వాన్, అహ్మద్, ఆసిఫ్, షాహుల్, మస్తాన్, ఆసిఫ్ తెలియజేశారు. ఈనెల మార్చి 14న మచిలీపట్నంలో జనసేనపార్టీ పదవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు ముస్లింల గురించి ముస్లిం మైనార్టీల సందేహాలు గురించి వివరణ ఇవ్వడం జరిగింది. ముస్లింల పైన ప్రేమని చాటుకోవడం జరిగింది ప్రతి ముస్లిం కి అండగా ఉంటామని, ముస్లింల అభివృద్ధికి తోడ్పడుతానని పవన్ కళ్యాణ్ గారు పిలుపునివ్వడం జరిగింది. రానున్న 2024 ఎన్నికలలో ప్రతి ముస్లిం కుటుంబ సభ్యుడు కూడా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారికి అండగా నిలబడాలని మనవి ఎందుకంటే పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన మాట పైన నిలబడే వ్యక్తి, నీతి నిజాయితీపరుడు,సేవా తత్పరుడు అలాంటి వ్యక్తి అధికారంలోకి వస్తే ప్రతి ముస్లిం కుటుంబ సభ్యులకు మేలు జరుగుతుంది. చరిత్రలో చూసుకుంటే ప్రతి నాయకుడు కూడా ముస్లిం మైనారిటీలను ఒక ఓటు బ్యాంకు లాగా చూశారు తప్ప ముస్లింల అభివృద్ధికి తోడ్పడింది లేదు, కానీ మొదటిసారి ఒక వ్యక్తి నిజాయితీగా ముందుండి ముస్లిం మైనార్టీలను అభివృద్ధి వైపు నడిపిస్తానని వస్తున్నాడు. ఎన్నిసార్లు మోసపోతాం ఎంతవరకు మోసపోతాం ఒకసారి మోసపోతే అది మన తెలివి లేని తనం, పదే పదే మోసపోతే అది మన చేతకానితనం. ప్రతి ముస్లిం సోదరుడు కూడా మనస్సాక్షిగా ఆలోచించండి పవన్ కళ్యాణ్




## జనసేన సభతో వైసీపీ పార్టీకి మతి భ్రమించింది



**అనంతపురం ( జనస్వరం )** : జనసేన 10 వ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుండి అశేషంగా జనం తరలివచ్చి సభను విజయవంతం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గారు రాష్ట్ర ప్రజల భావితరాల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ప్రసంగించిన ప్రసంగం అమాంతం జనసేన నాయకులు, కార్యకర్తలే కాకుండా రాష్ట్ర ప్రజలందరూ ఆసక్తిగా విని రాష్ట్రాన్ని పరిరక్షించే రక్షకుడు దొరికాడు అని సంతోషంతో జనసేన పార్టీకి ఆకర్షితులైనారని అనంతపురం జిల్లా జనసేన ఉపాధ్యక్షులు లాయర్ జయరాం రెడ్డి అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి ప్రసంగం విన్న తర్వాత వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ గాజు గ్లాస్ గుర్తుకే మా ఓటు అని రాష్ట్ర ప్రజలు చర్చించుకుంటున్నారు. జనసేన 10 వ ఆవిర్భావ సభ విజయవంతమైందని అక్కస్సుతో వైసిపి నాయకులు మతిభ్రమించి ఏదో ఒకటి విమర్శ చేయాలి కాబట్టి, అనవసరమైన విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకొని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గారిని విమర్శించడం మాని... వైసిపి పార్టీని, వైసీపీ శ్రేణులను ఎలా రక్షించుకోవాలో గుర్తెరిగి వసులుకుంటే మంచిది? అధికార మదమెక్కి తప్పుడు మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## ప్రతి జనసైనికుల కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుంది



**నంద్యాల ( జనస్వరం )** : కర్నూలు జిల్లా హాలహర్వి మండలం చింతకుంట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన జనసైనికుడు మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి రూ 10,000 /- ఆర్థిక సహాయం అందించిన జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇంచార్జి తెర్నెకల్ వెంకప్ప. అలాగే భవిష్యత్తులో మల్లికార్జున ఇద్దరి ఆడబిడ్డల (5,6 సంవత్సరాల) చదువులకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు చంద్ర, బడేసబ్, మహానంది, అరవింద్, రవి, భాస్కర్, మారుతి, సుదీర్, గంగాధర్, ఉపేంద్ర, మహేష్ మరియు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో మంజునాథ్ గౌడ్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరికలు

**రాయదుర్గం ( జనస్వరం )** : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి సిద్ధాంతాలకు ఆకర్షితులై రాయదుర్గం నియోజకవర్గం, వెంకటంపల్లి గ్రామంలో పలువురు జనసేన పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇంచార్జ్ మంజునాథ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పార్టీ నాయకుల అరాచకాలను ప్రజలు చూడలేకపోతున్నారని, రానున్న రోజుల్లో వైసీపీని గద్దె దింపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. వైసీపీ, టీడీపీ రెండు పార్టీల ప్రభుత్వాలను చూశారు. ఈ సారి పవన్ కళ్యాణ్ గారికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో గుమ్మగట్ట మండల కన్వీనర్ తిప్పేరుద్ర, కణేకల్ మండల కన్వీనర్ రవికుమార్, రంజిత్, ఆపన్న, వన్నూరుస్వామి, అజయ్, పోలేపల్లి తిప్పేస్వామి, తిప్పేష్, సుధా, రాఘవరెడ్డి ఇతర నాయకులూ పాల్గొన్నారు.



# రాష్ట్ర రాజకీయాల్లో జనసేన బలమైన సంతకం చేస్తుంది

జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవం

ప్రతి వాట్సాప్ మెసేజ్ కు నన్ను సమాధానం చెప్పమంటే ఎలా..? నేను ఏది చేసినా పారదర్శకంగా, బహిరంగంగా మాత్రమే ప్రజల మధ్యలో చేస్తాను. రహస్య ఒప్పందాలు చేసుకునే వాడిని కాదు. నాకు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయి. 2014లో జనసేన పార్టీ పెట్టినప్పుడు మోదీ గారి బలమైన నాయకత్వం దేశానికి కావాలని కోరుకున్న వాడిని. అందుకే ఆ సమయంలో బీజేపీకి మద్దతుగా నిలిచాను. తర్వాత కూడా బీజేపీకి అనేక పర్యాయాలు మద్దతుగా నిలబడ్డాను. అయితే బీజేపీ రాష్ట్ర నాయకత్వం మాత్రం ఉమ్మడి కార్యక్రమాలకు ముందుకు రాకపోవడం వల్ల కొన్ని ఇబ్బందులు వచ్చాయి. అమరావతి రాజధాని విషయంలోనూ బీజేపీ జాతీయ నాయకులు ఒక భారీ లాంగ్ మార్చ్ ను జనసేన పార్టీ, బీజేపీ సంయుక్తంగా నిర్వహించేలా ప్లాన్ చేశారు. దీనివల్ల రాష్ట్రంలో ఇరు పార్టీల బలం పెరగడంతో పాటు ప్రజల ఆకాంక్షలు రాజధాని మీద నెరవేరుతాయని భావించాం. అయితే తర్వాత దానిని ముందుకు తీసుకు వెళ్లలేకపోయాం. బీజేపీ జాతీయ నాయకులు మాతో చాలా క్లియర్ గా ఉన్నారు. నాకు వారితో మంచి సంబంధాలు ఉన్నాయి. అయితే స్థానిక బీజేపీ నాయకులు మాత్రం నేను తెలంగాణలో పోటీ చేస్తాను అంటే ఆంధ్ర వ్యక్తివి అంటున్నారు. వారికి మద్దతు ఇవ్వాల్సిన సమయంలో మాత్రం ఆ మాట అనడం లేదు. ముందుగా నేను భారతీయుణ్ణి. ఏ సమస్యల గురించి అయినా, ప్రజాస్వామ్యయుతంగా ఎక్కడి నుంచి పోటీ చేయడానికి అయినా నేను సంసిద్ధంగా ఉంటాను. నేను భారతీయుడిని అన్న భావన ఉంది కాబట్టే బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లోకి వస్తే మనస్ఫూర్తిగా స్వాగతించాను.

***స్టీల్ ప్లాంట్ మీద పోరాటం విషయంలో మా ప్రణాళిక పని చేయలేదు**

రాష్ట్ర ప్రయోజనాలకు ఎప్పుడు భంగం కలిగినా గట్టిగా మాట్లాడే వ్యక్తిని. దానికోసం మిత్రపక్షం బీజేపీ నాయకులతోనూ మాట్లాడాం. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ విషయంలో సమస్య తలెత్తినప్పుడు మేం బీజేపీ జాతీయ నాయకులతో మాట్లాడినప్పుడు దానికి ఒక పరిష్కారం లభించింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్ళినప్పుడు జనసేన పార్టీ తరఫున ముందుగా స్పందించింది నేనే. దానికోసం కేంద్ర నాయకులతోనూ మాట్లాడాను. విశాఖ స్టీల్ ప్లాంట్ అనేది రాష్ట్ర ప్రజల భావోద్వేగ సమస్యగా వారికి వివరించాను. సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరాను. అయితే తర్వాత వైసీపీ నాయకులు ఉద్యమంలోకి వచ్చాక ఉద్యమం సరైన రీతిలో సాగలేదు. మాకు చట్టసభల్లో కనీసం ఎలాంటి బలం లేకపోయినా జాతీయ నాయకులతో మాట్లాడగలిగాం. 25 సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా మెడలు వంచి తీసుకువస్తామని చెప్పిన పెద్ద మనిషి... ఢిల్లీ వెళ్లి కనిపించిన ప్రతి వారి వద్ద తానే మెడలు వంచుతున్నారు. అంతా కలిసి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఒకరోజు రాష్ట్ర బంద్ కు పిలుపునిస్తే ఎందుకు సమస్య తీరదు? జిందాల్ కు సొంత గనులు కేటాయించినట్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఎందుకు సొంత గనులు కేటాయింపు జరగదు..? కచ్చితంగా ఐక్యంగా ఉంటే సమస్య తీరుతుంది. అయితే రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టని వైసీపీ నాయకులు ఈ సమస్యను రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు.

***ఒంటరిగా వెళ్లేందుకు అయినా సిద్ధం**

జనసేన పార్టీ బలాబలాలపై కచ్చితంగా నియోజకవర్గాల్లో అన్ని పరిస్థితులను ఆధారంగా చేసుకొని సర్వేలు చేపడతాను. కచ్చితంగా క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ బలంగా ఉంటే ఒంటరిగా అయినా ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. క్రిమినల్ పాలిటిక్స్ నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి. ఈ రాష్ట్రాన్ని నేరస్థుల నుంచి విముక్తం చేయకపోతే అరాచకం రాజ్యమేలుతుంది. జనసేన పై జరుగుతున్న గోబెల్స్ ప్రచారాన్ని నమ్మకండి. జర్మనీలో అసత్య ప్రచారం చేసిన గోబెల్స్ చివరకు దిక్కు లేని చావు చచ్చాడు. రాష్ట్రంలోనూ జనసేన పార్టీపై గోబెల్స్ ప్రచారం చేసిన వారికి అదే గతి పడుతుంది.

***తిన మరిగిన కోడి వైసీపీ**

మా మగతనం గురించి, దమ్ము గురించి వైసీపీ నాయకులకు ఎందుకు..? మీ రాజకీయం మీరు చేసుకోండి. మేం రాజకీయంగా ఎలా బలపడాలో ఎక్కడ పోటీ చేయాలో మేము చూసుకుంటాం. 175 స్థానాల్లో పోటీ చేయాలో లేదో మేం చూసుకుంటాం. బాగా తిని మరిగిన కోడి ఇల్లు ఎక్కి కూసింది అంట... అలాగే ఉంది వైసీపీ నాయకుల మానసిక స్థితి. ఇసుక, గంజాయి, మద్యం, మైన్లు ద్వారా దోచేసిన సొమ్మును, ప్రజల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా అనధికారికంగా సేకరించిన సొమ్మును ఎన్నికల్లో మళ్లీ ప్రజలకే పంచేందుకు వైసీపీ నాయకులు చూస్తున్నారు. అంటే మన ఆరోగ్యాలు, కాలం కరిగించి ప్రభుత్వానికి కట్టిన సొమ్ము మళ్ళీ మనకే ఇవ్వాలని చూస్తోంది. దీనిని ప్రతి ఒక్కరు గుర్తించాలి. మదం తలకెక్కి వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారు. దుర్యోధనుడు తొడకొడితే భీముడు ఆ తొడలు బద్దలు కొట్టాడు. వైసీపీ నాయకులు కొట్టే తొడలను జనసేన కచ్చితంగా బద్దలు కొడుతుంది. మీరు మాట్లాడే ప్రతి మాటను గుర్తు పెట్టుకుంటాం.. దానికి కచ్చితంగా మీరు శిస్తు కట్టాల్సిందే. రాష్ట్ర భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రజలందరినీ చేతులెత్తి వేడుకుంటున్నా. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీకి అండగా నిలబడండి. మేము దెబ్బలు తిన్నాం నిలబడ్డాం.. ప్రజల గురించి పోరాటం చేశాం. కచ్చితంగా మేం మీకు అండగా ఉండటానికి, రాష్ట్రాన్ని కాపాడడానికి జనసేన పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలి.




***గంజాయి నిరోధానికి జనసేన కట్టుబడి ఉంది**

ఆంధ్రప్రదేశ్ గంజాయి మత్తులో తూగుతోంది. అధికార పక్షమే గంజాయి సాగుకు, రవాణాకు వత్తాసు పలుకుతోంది. దేశవ్యాప్తంగా దొరుకుతున్న గంజాయిలో 26% గంజాయి ఆంధ్రప్రదేశ్ నుంచే వెళ్లడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రజా ప్రతినిధులు గంజాయి సాగు, రవాణా, అమ్మకాన్ని చక్కగా ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగ రాష్ట్రంగా మిగిల్చిన ఆంధ్రప్రదేశ్లోని యువత జీవితాలను గంజాయి దెబ్బతో నాశనం చేస్తున్నారు. గంజాయిని భారీగా పట్టుకొని తగులు పెట్టిన రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ ను ఆ పదవి నుంచి పక్కకు తప్పించిన ప్రభుత్వం ఇది. అంటే రాష్ట్రంలో గంజాయి ప్రోత్సాహం అధికార పార్టీయే చేస్తున్నట్లు అర్థమవుతుంది. రాష్ట్రంలో గంజాయి నిరోధానికి జనసేన ప్రభుత్వంలో ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తాం. గంజాయి రవాణా చేసేవారు, సరఫరా చేసేవారు ఎంత పెద్ద వారైనా తాట తీసి కూర్చోబెట్టే బాధ్యతలు మేము తీసుకుంటాం. ఆంధ్రప్రదేశ్ ను పూర్తిస్థాయిలో గంజాయి లేని రాష్ట్రంగా చేస్తాం.



***మద్య నియంత్రణకు కొత్త తరహా ప్రణాళిక**

రాష్ట్రంలో పూర్తిస్థాయిలో మద్యనిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వంలా నేను మాయ మాటలు చెప్పను. మద్యం నిషేధం అనేది దాదాపు అసాధ్యం. అయితే మద్య నియంత్రణ కోసం జనసేన ప్రభుత్వంలో ప్రత్యేక విధానం తీసుకువస్తాం. రాలే గావ్ సిద్ధిలో అన్నా హజారే తీసుకువచ్చిన పద్ధతిలో ఆయా ప్రాంతాల పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు మాకు వద్దు అని అక్కడి స్థానికులు చెబితే వెంటనే ఆ ప్రాంతంలో మద్యం దుకాణాలు తీసివేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. మెజారిటీ ప్రజలు వద్దు అన్నచోట బ్రాందీ షాపులు మూసేస్తాం. క్రమంగా మార్పు వస్తే ఆయా ప్రాంతాల్లో పూర్తిగా మద్య నియంత్రణ చేపడతాం. దీనికోసం జనసేన ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తుంది.

***అప్పట్లో నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు**

అమరావతి రాజధాని విషయంలో మొదట్లోనే నేను రాజధానిని చిన్నగా మొదలుపెట్టి తర్వాత క్రమంగా విస్తరించాలని సూచన చేశాను. చిన్నగా కట్టమని చెప్పాను. అదే జరిగితే ఇప్పుడు రాష్ట్రం రాజధాని లేని రాష్ట్రంగా ఉండిపోయేది కాదు. న్యాయ రాజధాని అని లోకాయుక్త కర్నూలు తీసుకువెళ్లారు. అక్కడ పూర్తిస్థాయిలో లోకాయుక్తలను నియమించలేదు. న్యాయ రాజధాని అని చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పుడు విశాఖపట్నం రాజధాని చేస్తామని అంటున్నారు. అక్కడ ఇప్పటికే అభివృద్ధి జరిగింది. వైసీపీ వెళ్లి ఉన్నది దోచుకోవడం తప్పితే అక్కడ అభివృద్ధి చేసేది ఏమీ లేదు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి లాభం పొందడానికి ఇలాంటి నాటకాలు ఆడుతోంది.

***ఉద్యోగులు మోసపోయారు**

సి.పి.ఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకుడు తర్వాత అసాధ్యం అని, అప్పట్లో తెలియక హామీ ఇచ్చామని చిన్నపిల్లల మాటలు చెబుతున్నారు. ఇప్పుడు తాజాగా గ్యారెంటీ పింఛన్ స్కీం తీసుకోవచ్చాం అని మరో మాట అంటున్నారు. దానికోసం వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న పాలకులు అది ప్రజల డబ్బు అని గుర్తు పెట్టుకోవాలి. ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ డబ్బులు సకాలంలో వారికి అందడం లేదు. వారి డబ్బులను కూడా ప్రభుత్వం ఖర్చు పెట్టుకుంది. రూ. 2 వేల కోసం ఈసారి ఎవరు ఓటును అమ్ముకోవద్దు. ఓటును అమ్ముకుంటే మార్పు రాదు. విలువలు మాట్లాడేవాడు ఎప్పటికీ ఓడిపోతూనే ఉంటాడు. మేం ప్రభుత్వంలోకి వస్తే ప్రభుత్వంలో పారదర్శకత విధానాన్ని కచ్చితంగా తీసుకువస్తాం. ప్రజా ప్రతినిధులు ప్రజలకు ప్రతిదానికి సమాధానం చెప్పేలా మా అకౌంట్ బులిటీ ఉంటుంది. అది పవన్ కళ్యాణ్ అయినా ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే. ప్రజా ధనానికి ధర్మకర్తలుగా ఉండాల్సిన ప్రజా ప్రతినిధులు ప్రతి అంశానికి పారదర్శకంగా సమాధానం చెప్పేలా అవినీతి లేకుండా మేం చూస్తాం. కళ్ళెదుటే ఇన్ని తప్పులు జరుగుతున్నా ప్రజల్లో ఎందుకు కోపం రాదు..? మా రెడ్డి, మా కాపు అని వదిలేస్తే ఎలా..?

***ముస్లిం సమాజాన్ని కంటికి రెప్పలా చూసుకుంటా**

నేను బీజేపీతో పొత్తులో ఉన్నప్పుడు చాలామంది ముస్లింలు నన్ను వీడి వెళ్లారు. జనసేన మూల సిద్ధాంతాల్లోనే మత ప్రస్తావనలేని రాజకీయం ఉంది. ముస్లింలకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా, ( **తరువాయి పేజీ** )

వారి భద్రతకు భంగం వాటిల్లినా నేను ఎంతటి వారినైనా ఎదిరిస్తాను. కచ్చితంగా గట్టిగా మాట్లాడుతాను. భారతదేశమంటే వసుధైక కుటుంబం. నేను సభల్లో మాట్లాడే సమయంలో నమాజ్ వినిపిస్తే వెంటనే గౌరవం ఇచ్చేలా, ప్రసంగం నిలిపివేస్తాను. ఇది నేను ఇస్లాం కు ఇచ్చే గౌరవం. రాష్ట్రంలో ముస్లింలను, హిందువులను విడదీసేలా రాజకీయం జరుగుతోంది. ఇప్పటికీ పిఠాపురం, రామతీర్థం ఆలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని ఈ ప్రభుత్వం పట్టుకోలేకపోయింది. దీని వెనుక కచ్చితంగా మతాల మధ్య అంతరం సృష్టించే ఆలోచన ఉందని బలంగా నమ్ముతున్నాను. నేను బీజేపీ తో మిత్రపక్షంగా బహిరంగంగా మద్దతు ప్రకటించాను. అయితే వైసీపీ నాయకులు ఢిల్లీకి వెళ్లి ఎవరెవరి కాళ్ళు పట్టుకుంటారో, ఎవరికి మద్దతు ఇస్తారో నాకు తెలుసు. ముస్లిం సమాజం వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ వైపు నిలబడాలని కోరుతున్నాను. వారికి ఏ చిన్న ఇబ్బంది వచ్చినా వెంటనే స్పందిస్తాం.. అండగా నిలబడతాం. దాన్ని మేం బాధ్యతగా భావిస్తాం.

***యువత కులాల ఉచ్చులో పడకూడదు**

వచ్చే భావితరాలు కులాలను చూడకండి. కులాల గురించి టన్నుల కొద్ది ఉపన్యాసాలు చెప్పేవారు కూడా వారి ఇంట్లో పిల్లలకు కులాలకు అతీతంగా పెళ్లిళ్లు చేస్తున్నారు... బాగుంటున్నారు. ఇతరులకు చెప్పేటప్పుడు మాత్రం కుల జాడ్యం నూరిపోస్తున్నారు. ఒకే కులం, మతం వల్ల సమాజం నడవదు. కులాన్ని చూడకుండా గుణాన్ని చూసి యువత వారి పక్షాన నిలబడాలి. యువత కులాల ఉచ్చు నుంచి బయటకు రావాలి. ఉచిత విద్య, వైద్యం కోసం జనసేన పార్టీ కట్టుబడి ఉంది. ఏ పార్టీ కోసం కులం కోసం జనసేన పనిచేయదు. నన్ను తిట్టించడానికి కాపులను, బీసీలను, దళితులను వాడుకుంటున్నారు. అగ్రవర్ణ కుల నాయకులు మాత్రం నన్ను తిట్టడానికి ముందుకు రారు. అంటే జనాభాలో అధిక శాతం ఉన్న మనలో మనం కొట్టుకు చస్తే వారికి పోటీ ఉండదు. రాష్ట్రంలో అభివృద్ధి ఆలోచన మరిచి, కుల ఆలోచన చేస్తున్నాం. ఈ పద్ధతి నిజంగా మారాలి అని బలంగా భావిస్తున్నాను. యువతరం కూడా కుల నాయకుల్ని ప్రశ్నించండి. కులం కోసం ఏం చేశారు అని నిలదీయండి. జనసేనకు అధికారం ఇస్తే కుల నాయకులతో పని చేయించే బాధ్యత నేను తీసుకుంటా. మీ అందరికీ ఒక కూలీగా పని చేస్తా.

***నాకు డబ్బు ఆశ లేదు.. అవసరం కాదు**

ఒకప్పుడు అన్నయ్య చిరంజీవి గారికి బాడీగార్డుగా ఉంటే ఈ జీవితం చాలు అని భావించాను. అక్కడి నుంచి ఇప్పుడు రోజుకు రెండు కోట్ల రూపాయల మేర సినిమా రెమ్యూనరేషన్ తీసుకునే స్థాయికి నన్ను తీసుకువచ్చింది అభిమానులే. కొందరు నాకు వెయ్యి కోట్ల రూపాయలు



బీఆర్ఎస్ ఇచ్చింది అంటారు.. ప్యాకేజీ అంటారు. ఆ మాటలు అన్నప్పుడే నేను చెప్పు చూపించాను. మరోసారి అలా అనేవారికి గట్టిగా పడుతుంది. నేను చూడని సుఖాలు లేవు.. నాకు మీ గుండెల్లో ఇచ్చే స్థానం కన్నా ఏదీ విలువైనది కాదు. 1964 నుంచి రాష్ట్రంలో మార్పు రావాలి, అధికారం రాని కులాలకు రాజ్యాధికారం దక్కాలని చాలామంది మాట్లాడారు. వారంతా కేవలం మాటలకే పరిమితమయ్యారు. నేను ధైర్యం చేసి ఒక అడుగు ముందుకు వేసి దూకేశా. ఎందుకు రాజ్యాధికారం దక్కదు అని పోరాటం మొదలుపెట్టాను. కచ్చితంగా ప్రజా మద్దతును కూడగట్టి ముందుకు వెళ్తాను. 2014 లో పార్టీ పెట్టినప్పుడు ఒక్కడిగా మొదలైన ప్రస్థానం ఈరోజు క్రియాశీలక సభ్యులే 6.50 లక్షలకు చేరుకున్నారు. ఒక పెద్ద సమూహాన్ని సిద్ధాంత బలంతో ముందుకు తీసుకురాగలిగా. కచ్చితంగా త్వరలోనే అధికారం వైపు బలంగా అడుగులు వేస్తాం.

***కులం పెత్తనం ఆగిపోవాలి**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కులం పెత్తనం ఆగిపోవాలి. రెడ్డి సామాజిక వర్గానికి అన్ని కీలకమైన పదవులను ఇస్తే, మిగిలిన అణగారిన కులాలకు రాజ్యాధికారం ఎలా దక్కుతుంది. జనాభాలో అత్యధికంగా ఉండే కాపులు కచ్చితంగా పెద్దన్న పాత్రను పోషించాలి. నేను పదే పదే ఇదే మాట చెబుతున్నా. బీసీలు, దళితులను కలుపుకొని వెళ్లి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి. ఇప్పటివరకు అధికారం దక్కని కులాలకు కచ్చితంగా అధికారం రావాలి. అలాగే అగ్రవర్ణాల్లో చాలామంది పేదలు ఉన్నారు. వారికి అన్ని రంగాల్లో న్యాయం చేయాలి అండగా నిలబడాలి. అగ్రవర్ణాల్లో పేదల ఆవేదనను జనసేన పార్టీ అర్థం చేసుకుంది. వారి అభ్యున్నతి కోసం మేము ప్రత్యేకంగా పాలసీ తయారు చేస్తాం. సంఖ్యా బలం ఉన్న కులాలు సైతం తమ పనుల కోసం, నిధుల కోసం దేహి అనే పరిస్థితి పోవాలి. ఐక్యత సాధిస్తే సంఖ్యా బలం ఉన్న కులాలు డిమాండ్లు సాధించుకోవడం చాలా సులభం. అన్ని కులాల్లోనూ మార్పు రావాలి. ఏ కులంలో పుట్టాలి అన్నది మన ఛాయిస్ కాదు.. ఏ కులంలో పుట్టినా అణగారిన కులాలకు అండగా నిలబడాలి అన్నదే నా ఆలోచన. అన్ని కులాలు బాగుండాలి అందరి ఆర్థిక అభివృద్ధి మెరుగ్గా ఉండాలి అని బలంగా కోరుకునే వాడిని. ఏ కులానికి కష్టం వచ్చినా ముందుండేవాడిని. నన్ను కులం పేరుతో దూషిస్తే చాలా బాధేస్తుంది. నేను విశ్వ నరుడ్ని. కులాల కోటలు బద్దలు కొట్టి ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని బలంగా కోరుకునే వాడిని. ప్రతి కులాన్ని మనస్ఫూర్తిగా గౌరవించేవాడిని. మత్స్యకారులకు సమస్య వచ్చినా, సుగాలి బిడ్డకు కష్టం వచ్చినా ముందుండి ఆ సమస్యను తీర్చడానికి ప్రయత్నం చేసే వ్యక్తిని. రాష్ట్రంలో కులాల ఐక్యత చాలా అవసరం. మనలో మనమే కొట్టుకు చచ్చిపోతే కులాలు విచ్ఛిన్నం అవుతాయి. అది సమాజానికి చాలా ప్రమాదకరం. కుల ఆలోచనల నుంచి మానవత్వంతో నిలబడడానికి సమాజంలో పరివర్తన తీసుకురావడానికి నేను ఎల్లవేళలా ప్రయత్నిస్తాను.

***దెబ్బ పడే కొద్దీ బలపడ్డాం**

సమాజంలో ఒక అద్భుతమైన మార్పు కోసం రాజకీయ ప్రయాణం ప్రారంభించాను. 9 ఏళ్లు ఓటమిని, బాధలను, కష్టాలను దాటుకుంటూ ప్రయాణం సాగిస్తూనే ఉన్నాం. ధైర్యం ఉన్నచోటే లక్ష్మీ ఉంటుంది అని బలంగా నమ్మే వ్యక్తిని. ఆర్థిక వనరులు ఏమీ లేకున్నా నా సొంత శ్రమతో పార్టీని ముందుకు నడిపిస్తున్నాను. దశాబ్ద కాలంలో మాటలు పడ్డాం.. మన్ననలు పొందాం. మహా అయితే ప్రాణాలు పోతాయి.. జాతీయ నాయకుల స్ఫూర్తి పోకూడదు అనే లక్ష్యంతో పార్టీని ముందుకు తీసుకు వెళ్తున్నాం. ధర్మం వైపు నిలబడడమే నాకు తెలుసు. దానిని మనస్ఫూర్తిగా స్వీకరించడం కర్తవ్యంగా భావిస్తాను. ఈ ప్రయాణంలో ప్రజా ఆశీస్సులు తప్పక పొంది, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ విజయ ప్రస్థానంలో మైలురాయి కావాలని, విజయ గర్వంతో నిర్వహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అన్నారు.



## పేద కుటుంబానికి10 వేలు ఆర్థిక భరోసా ఇచ్చిన KR Young Indian trust

**పెందుర్తి ( జనస్వరం )** : నియోజకవర్గంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన కీర్తిశేషులు ఇల్లపు శ్రీనివాస రావు గారు కుటుంబాన్ని పరామర్శించిన KR Young Indian trust సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్న KR Admin నవీన్ పెద్దమల్ల చేతుల మీదుగా 10 వేల ఆర్థిక భరోసా ఇవ్వడం జరిగింది. నవీన్ గారు మాట్లాడుతూ నరవ గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లపు శ్రీనివాస్ రావు గారు మరణించారని విషయాన్ని స్థానిక అడ్మిన్ మాకు తెలియజేయగానే వెంటనే మా పెద్దలు శివ భాస్కరరావు గారికి తెలియజేసి వారు ఆమోదంతో పెందుర్తి నియోజకవర్గం లో ఉన్న దాతలు సహకారంతో వారి కుటుంబాని పరామర్శించి 10 వేల ఆర్థిక భరోసా ఇవ్వడం జరిగిందని అన్నారు. వారి సతీమణికి ఏదైనా ఉద్యోగం ఇప్పించమని స్థానిక ప్రజలు కోరడం జరిగిందని తప్పకుండా మా వంతు ఉద్యోగం వచ్చేలాగా కృషి చేస్తామని మాట్లాడారు. స్థానిక అడ్మిన్ శ్రీకాంత్ గారు మాట్లాడుతూ సమస్య ఎక్కడున్నా KR అక్కడ ఉంటుందని, సామాన్య ప్రజలు ఎప్పుడు కష్టాల్లో ఉన్న యంగ్ ఇండియన్ ట్రస్ట్ సహకారం అక్కడ ఉంటుందని మరొక్కసారి ఈ కార్యక్రమం రుజువు చేసిందని, అతి తక్కువ సమయంలోనే పెందుర్తి పరవాడ సబ్బవరం మండల వాట్సాప్ గ్రూపులో ఈ విషయాన్ని తెలియజేయగానే క్రౌడ్ ఫండింగ్ ద్వారా 10 వేలు రూపాయలు సమకూరిందని అన్నారు. గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రజలకు కేఆర్ అండగా ఉంటుందని ఎంతోమందికి నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు కల్పించబడ్డాయని దయచేసి శ్రీనివాస్ గారు సతీమణి గారు కూడా ఒక ఉద్యోగం ఇవ్వగలిగితే వారి మనుగడకు ఉపయోగపడుతుంది KR సభ్యులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సభ్యులు గళ్ళ శ్రీనివాస్, గవర త్రిమూర్తులు, వబ్బిన జనార్ధన శ్రీకాంత్, బొడ్డు నాయుడు, గవర శ్రీను, రాజేష్, దొరబాబు పాల్గొన్నారు.




## ఇది పూర్తిగా అంకెల గారడి బడ్జెట్ : జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు

**విజయనగరం ( జనస్వరం )** : ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడి బడ్జెట్ అని జనసేన నాయకులు గురాన అయ్యలు విమర్శించారు. ఈ బడ్జెట్‌లో అంకెలు తప్పా ఏమీ కనిపించడం లేదంటూ ఎద్దేవా చేశారు. రూ.2.79లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో సంక్షేమానికి, అభివృద్ధికి పొంతన లేదన్నారు. కేవలం మద్యం రూపంలోనే ఆదాయం పెంచుకోవడం పద్ధతి కాదన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేని బడ్జెట్‌ను మంత్రి బుగ్గన అసెంబ్లీలో ప్రవేశపెట్టారని విమర్శించారు. ఆదాయం ఎంతో, ఖర్చు ఎంతో చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. అప్పులను ఆదాయంగా చూపించడం దారుణమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగకరంగా లేదని విమర్శించారు. సాగు,తాగు నీటి ప్రాజెక్టు లకు తగినంత కేటాయింపులు లేవన్నారు. వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూడటం భావ్యం కాదన్నారు. బడ్జెట్‌లో ఎక్కువ భాగం నిధులు డైరెక్ట్ బెనిఫిట్ స్కీంల కోసం కేటాయించారని, జిల్లాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని స్పష్టమవుతున్నదన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ "అభివృద్ధి నిల్ ,అప్పులు ఫుల్ అన్నట్లుగా వుంది" అని ఎద్దేవా చేశారు.

